కల్లాల్లోనే ధాన్యం..
రైతులకు టార్పాలిన్ల భారం

- ఒక్కో టార్పాలిన్ కవర్ రోజుకు రూ. 25 కిరాయి
- వర్షానికి ధాన్యం తడవకుండా రైతుల తంటాలు


బీబీపేటలో ధాన్యాన్ని టార్పాలిన్ కవర్‌లో కుప్పగా వేసిన రైతులు

బీబీపేట: "మూడెకరాల్లో వరి సాగు చేశాను. వరి పంటను కోసి వడ్లను కొనుగోలు కేంద్రానికి తరలించాను. ధాన్యం వర్షానికి తడవకుండా 12 టార్పాలిన్ కవర్లు కిరాయికి తెచ్చా. ఒక్కో టార్పాలిన్ రోజుకు రూ. 25 ప్రకారం 12 టార్పాలిన్లకు రూ.300 కిరాయి చెల్లిస్తున్నా. ఇప్పటికే ఇరవై రోజు లు గడవడంతో ఇప్పటికి రూ. 6 వేలు వరకు అద్దె అయింది. ఇంకా ఎన్ని రోజులు అవుతుందో కూడా తెలియడం లేదు అంటూ బీబీపేటకు చెందిన రైతు గౌరయ్య ఆవేదన వ్యక్తం చేశారు". మరో రైతు రాజయ్య మాట్లాడుతూ మూడు క్వింటాళ్ల ధాన్యానికి వచ్చే పైసలు టార్పాలిన్ కవర్లకే ఖర్చు అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. వర్షానికి తడవకుండా ధాన్యాన్ని రక్షించుకునేందుకు ఇలా ప్రతి రైతు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులపై మరింత ఆర్థికంగా భారం పడుతోంది. పంట చేతికొచ్చే వరకు క్రిమి సంహారక మందులు, ఎరువుల కోసం ఖర్చు ఒక ఎత్తైతే, పంట కోసిన తర్వాత వర్షానికి తడవకుండా కాపాడుకోవడం మరో ఎత్తు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు సబ్సిడీపై టార్పాలిన్ కవర్లు ఇచ్చేవారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీ డబ్బులు మంజూరు చేయకపోవడంతో సహకార సంఘాలు వాటి పంపిణీ నిలిపివేశాయి. జిల్లా వ్యాప్తంగా 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం 1.70 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తి చేశారు. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఎకరానికి 5 టార్పాలిన్లు అవసరం వచ్చినా రోజుకు రూ.1.94 లక్షల వరకు రైతులు కిరాయి చెల్లించాల్సిన పరిస్థితి.

ఆసరాకు నోచుకోని అభాగ్యులు


నక్క చైతన్య


నక్క బాల్‌కిషన్

మాచారెడ్డి : వాళ్లిద్దరు వరుసకు అన్నా చెల్లెల్లు. చెల్లెలు పుట్టుకతో మూగ కాగా, అన్న ఆరేళ్ల కిందట రోడ్డు ప్రమాదానికి గురై అవిటివాడయ్యాడు. దీంతో దివ్యాంగులైన ఇద్దరు ఆరేళ్ల కిందట ఆసరా ఫించన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ వారికి పింఛన్ మంజూరు కాకపోవడంతో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. మాచారెడ్డికి చెందిన నక్క లలిత, వీరయ్య దంపతులకు కూతురు చైతన్య పుట్టుకతోనే మూగ. ఆమె తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందారు. అనాథగా మారిన ఆమెను పెదనాన్న నక్క బాల్‌రాజు చేరదీశాడు. గతంలో ఫించన్ కోసం సదరం క్యాంపునకు వెళ్లగా అక్కడ జారీ చేసిన ధ్రువపత్రంలో చైతన్య పేరుకు బదులు శ్వేత అని నమోదైంది. దీంతో ఆమెకు ఫించన్ రాలేదు. ఈ సమస్యపై అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించుకోగా తప్పును సరిదిద్దాలని అధికారులను ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో 2015 మే 16న సాక్షి దినపత్రికలో 'మూగతల్లికి అందని ఆసరా' అన్న శీర్షికన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు చైతన్యకు ఫించన్ మంజూరు చేసి కొంతకాలం అందించి తర్వాత నిలిపివేశారు. చైతన్య ఆలనాపాలన చూసిన బాలరాజు కూడా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి చైతన్యను బాల్‌రాజు కొడుకు బాల్‌కిషన్ పోషిస్తున్నాడు. ఇటీవల బాల్‌కిషన్ కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడి అంగస్ వైకల్యానికి గురయ్యాడు. వీరిద్దరూ అన్ని ధ్రువీకరణ పత్రాలతో పింఛన్ కోసం దరఖాస్తు చేసినా అధికారులు తిప్పుకోవడమే తప్పే వారికి మాత్రం న్యాయం చేలేదు. ఈ విషయమై ఎంపీడీవో బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, సాంకేతిక లోపాల వల్ల ఆగిపోయాయని తెలిపారు.

అడవిలో టేకు చెట్లు మాయం


లక్ష్మాపూర్ అటవీ ప్రాంతంలో నరికి వేసిన చెట్టు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని లక్ష్మాపూర్ అటవీ ప్రాంతంలో కొందరు దుండగలు టేకు చెట్లతో పాటు ఇతర చెట్లను నరికి అక్కడి నుంచి మాయం చేస్తున్నారు. విషయం తెలిసినా అటవీశాఖ అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో లక్ష్మాపూర్ శివారులోని దట్టమైన అటవీ ప్రాంతంలో పెద్దపెద్ద చెట్లను నరికి భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. తిమ్మాపూర్ బీట్ పరిధిలోని సోమర్యాగడి తండాలో దాదాపు 50 టేకు దుంగలను నరికి అటవీ ప్రాంతంలో దాచి ఉంచడంతో అప్పట్లో అటవీ శాఖ అధికారులు వాటిని సీజ్ చేసిన విషయం తెలిసిందే. అటవీ ప్రాంతంలో చెట్లను నిరికి వేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పృథ్వీరాజ్ వెల్లడించారు. దుండగుల కదలికలపై నిఘా ఉంచేందుకు సిబ్బందిని పెంచుతామని తెలిపారు.

రైతులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తాం



భిక్కనూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తామని రామేశ్వర్‌పల్లి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందడి లక్ష్మరెడ్డి అన్నారు. గురువారం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కందడి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పైళ్ల సంతోషరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగార్తి రాంరెడ్డి, కోశాధికారిగా నల్ల లింగారెడ్డి, సహాయ కార్యదర్శిగా మద్ది క్రిష్టారెడ్డి బాధ్యతలను స్వీకరించారు.

సీఎం కప్ పోటీలకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఉషాగౌడ్

ఎల్లారెడ్డి: సీఎం కప్ పోటీల నిర్వహణ కోసం మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌ను జెడ్పీటీసీ ఉషాగౌడ్ పరిశీలించారు. 14 నుంచి 16 వరకు టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. ఎంపీడీవో నారాయణ, ఎంపీవో ప్రకాష్, పీడీ అతీకుల్లా పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

నాగిరెడ్డిపేట: మండలంలో 15 నుంచి ప్రారంభం కానున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనేవారు 13 లోగా పీఈటీల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో రఘు తెలిపారు. గోపాల్‌పేట మోడల్ స్కూల్ వద్ద పోటీలు నిర్వహిస్తామన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

పిట్లం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరం అని ఎంపీపీ కవిత పేర్కొన్నారు. ఆమె మండల పరిషత్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 15 నుంచి నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనే వారు 13వ తేదీ లోగా ఎంపీడీవో కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వొకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



కామారెడ్డి అర్బన్: ఇంటర్ ఒకేషనల్ కోర్సు పూర్తయిన తర్వాత చిన్న వయస్సులోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలాం అన్నారు. గురువారం స్థానిక స్ఫూర్తి ఒకేషనల్ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శేక్ సలాం అభినందించారు. కరస్పాండెంట్ కె.హన్మంతురెడ్డి, అధ్యాపకులు బి.స్వప్న, జె.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వివరాలు నమోదు చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

లింగంపేట: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం ఆయన లింగంపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రైతు ల నుంచి 12 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా ఇప్పటికి 5 మెట్రిక్ టన్నుల వివరాలు మాత్రమే ట్యాబ్‌లో నమోదు చేయడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ చంద్రరాజేశ్వర్, సీఈవో సందీప్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేటలో గురువారం పీఏసీఎస్ చైర్మన్ పాత లక్ష్మణ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్, సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ బక్కన్నగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కాంగ్రెస్ హయాంలోనే ఆలయాలకు పెద్ద పీట



మాచారెడ్డి: కాంగ్రెస్ హయాంలోనే ఆలయాలకు పెద్ద పీట వేశామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. మండలంలోని చుక్కాపూర్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరైనాయన పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్లు వెల్లడించారు. జెడ్పీటీసీ మినుకూరి రామ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మెన్ కమలాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇంద్రకరణ్ రెడ్డి, భీమ్ రెడ్డి, గణేష్ నాయక్ పాల్గొన్నారు.

గౌరారంలో కొనసాగుతున్న ప్రత్యేక పూజలు

పిట్లం: మండలంలోని గౌరారం తండాలో జగదాంబ మాత సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా రెండు రోజులు జరుగుతున్న పూజలు గురువారం కూడా కొనసాగాయి. 14వ తేదీ వరకు మహాయజ్ఞం, అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

హన్మాన్ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

భిక్కనూరు: మండలంలోని శ్రీ సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో పురాతనమైన పబ్బతి హన్మాన్ దేవాలయం పునర్ నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ జనగామ శ్రీనివాస్ ప్రారంభించారు.

ఇంటర్ విద్యార్థికి స్పీకర్ అభినందన


ఉమ్రా మెహవీన్‌ను అభినందిస్తున్న స్పీకర్

బాన్సువాడ: ఇంటర్ బైపీసీలో బాన్సువాడకు చెందిన ఉమ్రా మెహవీన్ 994 మార్కులు సాధించడంతో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని స్పీకర్ పేర్కొన్నారు. లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో భారతరత్న కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, నారాయణ, హన్మండ్లు, బాబయ్య, సంజీవరెడ్డి, జైపాల్, సృజన్, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

నాగిరెడ్డిపేట: కష్టపడి చదివి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని గి ఎంపీపీ రాజ్ దాస్ పేర్కొన్నారు. పదవ తరగతి ఫలితాలలో 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచిన తండాకు చెందిన ధరావత్ కైలాష్‌ను గురువారం ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, బంజారా సర్పంచ్ అరుణతో కలిసి ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వినోద్, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బెదిరింపులకు భయపడొద్దు

- బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి


కామారెడ్డిలో మాట్లాడుతున్న వెంకట రమణారెడ్డి


లింగంపేటలో..

కామారెడ్డి క్రైం: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెను విరమించి విధుల్లో చేరకుంటే ఉద్యోగం నుండి తొలగిస్తామని ప్రభుత్వం పేర్కొనడం నియంత పోకడకు నిదర్శనమని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జూనియర్ పంచాయితీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెలో గురువారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వ బెదిరింపులకు భయపడకుండా కలిసి కట్టుగా పోరాడితేనే ప్రభు త్వం దిగి వచ్చి సమస్య పరిష్కారం అవుతుందని సూచించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్, కౌన్సిలర్లు ప్రవీణ్, నరేందర్, నాయకులు వేణు, రవి, రమేష్ గౌడ్, నవీన్, రాజగోపాల్, రనిల్ రెడ్డి పాల్గొన్నారు.

లింగంపేట: సమ్మెలో భాగంగా జూనియర్ పంచాయితీ మహిళా కార్యదర్శులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ప్రభుత్వ హామీ మేరకు ఉద్యోగాలను క్రమబద్ధీకరించే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ప్రమాదం జరగకముందే స్పందించరూ!


బేగంపూర్ వద్ద రోడ్డు సమీపంలో ప్రమాదకరంగా వంగి ఉన్న విద్యుత్ స్తంభం

పెద్దకొడప్‌గల్: మూడు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు వంగి కిందపడే పరిస్థితిలో ఉన్నాయి. మండలంలోని బేగంపూర్ చౌరస్తా సమీపంలో విద్యుత్ స్తంభం వంగి పోయి ప్రమాదకరంగా ఉంది. సమస్యను విద్యుత్ సిబ్బందికి తెలియజేసినా స్పందించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుకోని సంఘటనలు జరిగితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం నెలకొంది.

జీవాలకు నట్టల మందు తాగించాలి


దేవునిపల్లిలో జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి రవికిరణ్


దోమకొండలో..

కామారెడ్డి రూరల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించాలని మండల పశువైద్యాధికారి రవికిరణ్ సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 2,760 గొర్రెలకు, 255 మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వీఏ సాయిరెడ్డి, నరేష్, ఓఎస్ ప్రవీణ్‌గౌడ్, గోపాల మిత్రుడు శ్రీనివాస్, మండల గొర్రెల, మేకల సంఘం అధ్యక్షుడు దొడ్లె మల్లేష్, గొర్రెల కాపరులు నాగల్ల రాజయ్య, మర్కంటి స్వామి, నాగల్ల ప్రభాకర్, మినాయి సంతోష్ పాల్గొన్నారు.

పారుడు వ్యాధి నిరోధానికి టీకా

దోమకొండ: పారుడు వ్యాధి నిరోధానికి దోమకొండలో గొర్రెలు, మేకలకు టీకా వేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, మండల పశువైద్యాధికారి శివకుమార్, గొల్ల కుర్మ సంఘం ప్రతినిధులు నేతుల మల్లేశం, నాగమల్లయ్య, లింగం, లింబాద్రి, బుచ్చమొల్ల లింగం, మల్లేష్, పోశయ్య పాల్గొన్నారు.

బోరు మోటార్ ప్రారంభం


బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ జ్ఞానేశ్వర్

కామారెడ్డి రూరల్: మండలంలోని తిమ్మక్‌పల్లి(కె) సర్పంచ్ జ్ఞానేశ్వర్ గురువారం బోరు మోటార్‌ను ప్రారంభించారు. జెడ్పీటీసీ చిదుర రమాదేవి, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు నిధుల నుంచి వాటికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

'రైతుబంధు' ప్రారంభించి ఐదేళ్లు



బాన్సువాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధు పథకం ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కేక్ కోశారు. రైతులకు పెట్టుబడి భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రైతు బంధు పథకం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్‌నాయక్, ముఖీద్, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలి



దోమకొండ: ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని డీఎల్‌పీవో సాయిబాబా సిబ్బందికి సూచించారు. దోమకొండ పంచాయితీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పంచాయితీల్లో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, బకాయిలను వెంటనే చేల్లించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో తిరుపతిరెడ్డి, ఈవో సౌజన్య, ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్, వార్డు సభ్యులు బుర్రి రవికుమార్ తదితరులు ఉన్నారు.

లారీల కోసం రోడ్డెక్కిన అధికారులు



నిజాంసాగర్: ధాన్యం బస్తాల తరలించేందుకు లారీల కొరతను అధిగమించేందుకు గురువారం స్థానిక తహసీల్దార్ నారాయణ, ఎంపీఐ గోపినాథ్ రోడ్డుపైకి వచ్చి బొగ్గ గుడిసె చౌరస్తా మీదుగా వెళ్తున్న లారీలను ఆపుతూ కొనుగోలు కేంద్రాలకు తరలించారు. మండలంలోని అచ్చంపేట, ఆరేడ్, బ్రహ్మణపల్లి, బూర్గుల్, తున్కిపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరించినా బస్తాల తరలించేందుకు లారీల కొరత ఏర్పడింది.

మన ఊరు మనబడి పనులు ప్రారంభం



కామారెడ్డి రూరల్: మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చిన్నమల్లారెడ్డి గ్రామంలో రూ. కోటితో నిర్మించనున్న పాఠశాల భవన నిర్మాణ పనులకు గురువారం ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నబాయి, ఆనంద్‌రావు, ఉప సర్పంచ్ వనిత రాజిరెడ్డి, జెడ్పీటీసీ చిదుర రమాదేవి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరి



బాన్సువాడ రూరల్: ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి సూచించారు. ఇప్పటికే నిర్మించుకున్న వారు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. గురువారం ఆయన మండలంలోని బోర్లం క్యాంపులో పర్యటించి బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు కృషి చేయాలన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



తాడ్వాయి: మండలంలోని ఎండ్రియాల్, నందివాడ గ్రామాలలో గురువారం పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. మదన్‌మోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోందని, యువకులు, మహిళలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు.

సంక్షిప్తం

కస్తూర్బా పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు

నిజాంసాగర్: జిల్లాలో 19 మండలాల్లో కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో 744 మందికి 714 మంది ఉత్తీర్ణత సాధించారు. 8 విద్యాలయాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సెక్టోరియల్ జిల్లా అధికారిణి ఉమారాణి తెలిపారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే చేర్పించాలి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలతో పాటు మరికొన్నింటికి ప్రభుత్వ గుర్తింపు లేదని డీఈవో ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించే సమయంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

ఆర్థిక సహాయం

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రామగల్ల సిద్దరాములు ఇటీవల మృతి చెందడంతో షబ్బీర్ అలీ ఫౌండేషన్ తరపున కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీంరెడ్డి, నాయకులు బాగారెడ్డి, ఎల్లం, బాబు పాల్గొన్నారు.

అంత్యక్రియల కోసం..

నిజాంసాగర్: మండలంలోని బూర్గుల్‌కు చెందిన అవుసుల అనిత (28) మహిళ అనారోగ్యంతో మృతి చెందడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు డబ్బులు లేకపోవడంతో డీఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ రూ. 10 వేలు మృతురాలి భర్త బాల్‌రాజ్‌కు అందజేశారు.

17వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్‌లో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 17వ రోజుకు చేరుకున్నాయి. కొందరు వారికి వత్తాసు పలకడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. దీక్షలో రెడ్డి సంఘం ప్రతినిధులు కూర్చొన్నారు.

చెక్కుల పంపిణీ

లింగంపేట: మండలంలోని లింగంపల్లి (ఖుర్దు)కి చెందిన బాల పోచవ్వకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 16 వేల చెక్కును సర్పంచ్ బండి రాజయ్య అందజేశారు.

ప్రమాద బీమా..

నిజాంసాగర్: మండలంలోని మంగ్లూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సుబ్బురి భూమయ్య మృతి చెందడంతో పార్టీ తరపున రూ. 2 లక్షల ప్రమాద బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు రవీందర్‌రెడ్డి, సాయిలు, భూమయ్య, ఆకాష్, బద్రినాథ్, ఉప సర్పంచ్ దత్తు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ

కామారెడ్డి అర్బన్: గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వార్షిక ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి స్టడీ మెటీరియల్‌తో పాటు ఉపకార వేతనం ఇస్తామన్నారు.

శివాలయంలో హుండీ చోరీ

కామారెడ్డి క్రైం: టేక్రియాల్ శివాలయంలోని హుండీని దుండగులు పగులగొట్టి అందులోని నగదు చోరీ చేశారు. బుధవారం రాత్రి సంఘటన జరుగగా స్థానికులు గురువారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.